క్లుప్తంగా

జీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు

కొత్తగూడెంరూరల్: సంక్రాంతి సందర్భంగా జీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన 'సెల్ఫీ విత్ రంగోలి' పేరిట వినూత్న కార్యక్రమం చేపడుతున్నామని ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య సంచాలకులు గడల శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఇంటి ఎదుట వేసిన ముగ్గుతో మహిళలు సెల్ఫీ కానీ, తక్కువ నిడివి వీడియో కానీ పేరు, ఇతర వివరాలతో 95040 06999, 90000 86767, 90000 37676 నంబర్లకు పంపించాలని సూచించారు. ఉత్తమమైనవి ఎంపిక చేసి ఈ నెల 26న బహుమతులు అందజేస్తామని డీహెచ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా సమస్యలపై సీఎం స్పందించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో కలెక్టరేట్ ప్రారంభానికి వచ్చే క్రమంలో జిల్లాలోని సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. స్థానిక మంచికంటి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోడు రైతులకు హక్కుపత్రాల జారీలో జాప్యం జరుగుతోందన్నారు. అంతేకాకుండా దరఖాస్తుదారుల్లో తక్కువ మందినే అర్హులుగా నిర్ధారించారని విమర్శించారు. ఇక గోదావరి ముంపు సమస్య, కరకట్ట నిర్మాణం, సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంతో పాటు కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు బైపాస్ రోడ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు మచ్చ వెంకటేశ్వరరావు, లిక్కి బాలరాజు, భూక్యా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీడబ్ల్యూవో కార్యాలయం ముట్టడి

ఇల్లెందురూరల్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల దినసరి కార్మికులు సోమవారం ఏటీడబ్ల్యూఓ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయ పనివేళలకు ముందే అక్కడకు చేరుకున్న వర్కర్లు ఎవరూలోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో ఏటీడబ్ల్యూఓ రూపాదేవి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వారించినా ససేమిరా అంటూ కార్మికులు ఆందోళన కొనసాగించారు. సీఐటీయూ నాయకులతో పోలీసులు, ఏటీడబ్ల్యూఓ చర్చించి రెండు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నబి, కృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికే పలుమార్లు ఆందోళన చేసినప్పటికీ వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాయం ముత్తయ్య, పద్మ, కుంజ జయ, అంజమ్మ, లావణ్య, సృజన, అరుణ, సారయ్య, అజయ్, సుబ్రహ్మణ్యం, అనిత, శ్రీను, సుజాత, భారతి, దాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలి

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆస్ట్రేలియాలో శిక్షణ పొందిన కార్పొరేట్ డీజీఎం గోపాల్‌రాజు పేర్కొన్నారు. సోమవారం ×కేటీసీలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఇంప్లిమెంటేషన్ అండ్ మానిటర్‌ªఅనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్‌ఎంపీ అమలులో అధికారులు, ఉద్యోగులు, ఆఫ్ లోడింగ్ ఇన్‌చార్జ్‌లు, సూపర్‌వైజర్ల బాధ్యతను వివరించారు. కార్యక్రమంలో కేటీసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్‌వీఆర్ ప్రహ్లాద్, ఇల్లెందు ఏరియా రక్షణాధికారి పి.శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజనీర్ సీహెచ్ శివశంకర్, మేనేజర్ సౌరభ్ సుమన్, రక్షణాధికారి కెఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జూలూరుపాడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జూలూరుపాడు సీఐ జె.వసంత్‌కుమార్ అన్నారు. సోమవారం జూలూరుపాడులో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నాలుగు మండలాలస్థాయి క్రికెట్ పోటీలను ఎస్‌ఐ పోటు గణేశ్‌తో కలిసి సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్‌ఐ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నవారిని అభినందించారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు చల్లగుండ్ల సతీశ్, జాలాది అవినాష్, కల్లోజి నరేశ్, హాలావత్ వంశీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి, యువజన నాయకులు అరెస్ట్

ఇల్లెందు: పోలీస్ అభ్యర్థుల ఎంపిక పద్ధతిలో తప్పులను సవరించాలని, అభ్యర్థులకు న్యాయం చేయాలని చేయాలని యువజన విద్యార్థి సంఘాల నేతలు ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం విదితమే. కాగా, పోలీసులు ముందస్తుగా కొందరు నాయకులను అరెస్టు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఇళ్లల్లో ఉన్న విద్యార్థి, యువజన సంఘాల నేతలు కాళంగి హరికృష్ణ, బయ్యా అభిమన్యు, పరిటాల వేణు, హైమద్, గణేశ్‌లను అరెస్టు చేశారు.

ఆ ఇళ్లు.. 'పచ్చ' తోరణం!

- సింగరేణి కార్మికుడి ఇంట్లో 'విజయ' దరహాసం
- ఔషధ మొక్కలు, చెట్ల తీగలతో ఆహ్లాదం
- గృహాలంకరణ పోటీల్లో పలుమార్లు అవార్డులు



విజయ - సుందర్ ఇంటి ఆవరణలోని మొక్కలు

ఇల్లెందు: ఆ ఇంటికి వెళ్తే ఎటు చూసినా మొక్కలే.. మొక్కలంటే ఆ ఇంటిల్లి పాదికి ప్రాణం.. ఖర్చు ఎంతైనా, శ్రమ ఎక్కువ ఉన్నా.. కష్టపడి, ఇష్టపడి మొక్కలను పెంచుకుంటున్నారు. ఇంటిని మొత్తం కమ్మేసిన మొక్కలు పచ్చతోరణంలా కనువిందు చేస్తాయి. ఇల్లెందు జేకేకాలనీకి చెందిన సుందర్ సింగరేణి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తుండగా, ఆయన సతీమణి విజయ సింగరేణి సేవా సమితి సెక్రటరీగా కొనసాగుతున్నారు. వారిద్దరికీ మొక్కలంటే ప్రాణం కావడంతో ఇంట్లో ఖాళీ స్థలం లేకుండా మొక్కల కుండీలతో నింపేసింది. దీంతో వారి క్వార్టర్ పచ్చతోరణంలా మారిపోయింది. కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల, పూల, ఔషధ మొక్కలతో పాటు వంటలలో ఉపయోగించే పలు రకాల మసాలా మొక్కలను కూడా కంటికి రెప్పలా కాపాడుతున్నారు.

మొక్కల్లో మచ్చుకు కొన్ని..

విజయ - సుందర్ ఇంటి ఆవరణలో అనేక రకాల అరుదైన మొక్కలు కూడా ఉన్నాయి. పాములు రాకుండా అడ్డుకుంటుందని చెబుతున్న తెల్లీశ్వరీ మొక్కను కూడా ఇక్కడ చూడొచ్చు. ఇక హైబ్రిడ్ అరటి మొక్కలు, ఇలాచీ ప్లాంట్, బిర్యానీ లీవ్స్, హైబ్రిడ్ సపోటా, సంపంగి, లెమన్ గ్రాస్, ఏడాదికి ఒకే పువ్వు పూసే బ్రహ్మకమలం, రామసీతాఫలం, మిక్స్‌డ్ మసాలా లీఫ్, తమలపాకులు, తిప్ప తీగ, ఇన్సులిన్ లీఫ్స్, నల్లైడ, లవంగం, తులసి, డెకరేషన్ ప్లాంట్స్.. ఇలా చెబుతూ పోతే అరుదైన అనేక మొక్కలను సేకరించి చంటిబిడ్డలా సాకుతున్నారు.

2007 నుంచి మొక్కల సేకరణ

జేకే కాలనీలోని సింగరేణి ఎస్‌డీ-40 క్వార్టర్‌లో నివాసం ఉంటున్న విజయ - సుందర్ 2007 నుంచి రకరకాల మొక్కలు సేకరించడం మొదలుపెట్టారు. ఇంటి ఆవరణలోని రేకుల వసారా కింద కుండీలు ఏర్పాటు చేసి పెంచుతున్నారు. ప్రతీరోజు గంటల సమయం కేటాయించి వీటికి నీళ్లు పట్టడం, పేడ కలిపిన ఎరువు అందించడం చేస్తుండడంతో మొక్కలు ఏపుగా పెరిగి చల్లదనాన్నే కాక ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నీటి ఎద్దడి ఎదురైతే ట్యాంకర్ నీరు కొనుగోలు చేసి మరీ మొక్కలకు పట్టిస్తుండడం విశేషం. ఈ క్రమంలోనే మొక్కల పెంపకానికి గాను సింగరేణి ఆవిర్భావ ఉత్సవాల్లో పలు దఫాలుగా ఉత్తమ గృహాలంకరణ అవార్డుకు విజయ - సుందర్ ఎంపికయ్యారు. ఈ ఏడాది కూడా ఎమ్మెల్యే హరిప్రియ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

సేవా కార్యక్రమాల్లోనూ ముందంజ

సింగరేణి సేవా సమితి కార్యదర్శిగా పనిచేస్తున్న విజయసుందర్ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తన భర్త వేతనం నుంచి ప్రతీనెలా కొంత చొప్పున పేదలు, వృద్ధుల సంక్షేమానికి కేటాయిస్తున్నారు. ఇల్లెందు, ఖమ్మం, కొత్తగూడెంలో పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు దుప్పట్లు, బట్టలు, స్వెటర్లు అందజేయడమే కాక, అంగన్‌వాడీ, పాఠశాలల్లో పేద విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పలకలు వితరణ చేయడం ఆనవాయితీగా మార్చుకున్నారు. ఇక కరోనా సమయంలోనూ విజయ స్వయంగా మాస్కులు కుట్టి అవసరమైన వారికి పంపిణీ చేశారు.



మొక్కలను పరిశీలిస్తున్న విజయ - సుందర్

ఆనందంగా ఉంది



ఇంటి ఆవరణలో మొక్కలు పెంచటం వల్ల కాలుష్య రహితంగా జీవించగలుగుతున్నాం. ఆరోగ్యానికి తోడు ఆహ్లాదం కూడా మా సొంతమవుతోంది. ప్రతీ రోజు మొక్కలతో రెండు, మూడు గంటలు గడపటం వల్ల సమయం గడిచిపోతోంది. సంతృప్తి మిగులుతోంది. మొక్కలు అంటే పంచ ప్రాణం. అందుకే ఏ కాలమైనా ఇల్లు పచ్చ తోరణంగా ఉండేలా కాపాడుకుంటున్నాం. దీనిని ఇలాగే కొనసాగిస్తాం.

–విజయసుందర్

సీఎం పర్యటనను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఈ నెల 12వ తేదీన గురువారం నూతన కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభోత్సవానికి వస్తున్నారని, నాయకులు, కార్యకర్తలు కలిసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెంక్లబ్‌లో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రం అయిన తరువాత తొలిసారి సీఎం వస్తున్నందున ఘనంగా స్వాగతం పలుకాలని పేర్కొన్నారు. సమావేశంలో వనమా రాఘవేంద్రరావు, నాయకులు, ప్రజాప్రతినిధులు కంచర్ల చంద్రశేఖరరావు, కొత్వాల శ్రీనివాసరావు, కాపు సీతాలక్ష్మి, భూక్య సోనా, భూక్య రాంబాబు, బత్తు వీరయ్య, మండే వీరహనుమంతరావు, అన్వర్‌పాషా, బరపటి వాసుదేవరావు, దామోదర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



క్త్రొగూడెంటౌన్: మాట్లాడుతున్న న్యాయవాదులు



ఇల్లెందు: నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: నిజామాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతితో పాటు కొందరు న్యాయవాదులపై పోలీసులు దాడిచేయడాన్ని నిరసిస్తూ ఇక్కడి న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాద్‌రావు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడి హేయమైన చర్యని పేర్కొన్నారు. సమావేశంలో ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు జలసూత్రం శివరాంప్రసాద్, రమేశ్‌కుమార్‌మక్కడ్, కటకం పుల్లయ్య, బచ్చలకూర రామచంద్రయ్య, రేపాక వెంకటరత్నం, లక్కినేని సత్యనారాయణ, సింగ్ ఉపేందర్, మల్లెల ఉషారాణి, పాండురంగ విఠల్, శరత్‌షాహమీర్, ఎండీ సాధిక్‌పాషా, మునిగడప వెంకటేశ్వర్లు, గాదె సునంద పాల్గొన్నారు.

ఇల్లెందు: నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కోర్టు సిబ్బందిపై బెలీఫ్‌పై అక్రమంగా కేసులు బనాయించిన విషయంలో, హనుమకొండ జిల్లా సుబేదారి పోలీస్ స్టేషన్‌లో న్యాయవాది కొత్తపెల్లి రాజును సీఐ ఇమ్రాన్ దూషించిన ఘటనలను ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విదులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహేశ్, కలువల సుధాకర్, కీర్తి కార్తీక్, సుడిగాల వెంకటనర్సయ్య, పప్పుల గోపీనాథ్, పి.బాలకృష్ణ, కొండ నారాయణ, రబ్బానీ, ఉమామహేశ్వరరావు, జయప్రకాష్, సూర్ణపాక సత్యనారాయణ, నవీన్‌కుమార్, అజయ్‌కుమార్, సౌమ్య, రమేశ్, బన్సీలాల్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి



జూలూరుపాడు: ఊరేగింపుగా వెళుతున్న మాలధారులు

జూలూరుపాడు: స్థానిక శ్రీసీతారామాలయంలో సోమవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు రంగు నాగభూషణాచారి, కొర్రా కీర్యా, కొర్రా వీరు, భూక్యా శివ మండలం రోజులు అయ్యప్ప దీక్ష పూర్తి చేసిన 17 మంది మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం మాలధారులు ఇరుముడితో ఊరేగింపుగా శబరిమలై యాత్రకు వెళ్లారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: మండలంలోని సింగభూపాలెం గ్రామంలోని రామాలయంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు గురుస్వాములను సన్మానించారు. శబరిమలై యాత్ర దిగ్విజయంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు.

ఎఫ్‌ఆర్‌ఓ జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నీ

ఇల్లెందురూరల్: విధి నిర్వహణలో హత్యకు గురైన ఎఫ్‌ఆర్‌ఓ చలమల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం అటవీశాఖ ఆధ్వర్యంలో ఇల్లెందు డివిజన్‌స్థాయి వాలీబాల్ పోటీలు ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీఓ నీరజ్ కుమార్ సోమవారం తెలిపారు. డివిజన్ పరిధిలోని ఇల్లెందు, కొమరారం, కాచనపల్లి, గుండాల రేంజ్ పరిధిలోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. 10, 11 తేదీల్లో గ్రామ పంచాయతీ నుంచి రేంజ్‌స్థాయి వరకు పోటీలు ఉంటాయన్నారు. డివిజన్ స్థాయిలో కొమరారం, కాచనపల్లి, గుండాల రేంజ్‌ల నుంచి ఒక్కో జట్టు, ఇల్లెందు రేంజ్ నుంచి రెండు జట్లు మొత్తంగా ఐదు జట్లు పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న జట్లు 76719 54820, 76719 54700, 76719 54760, 76719 54771 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ.10,116, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8,116, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5,116, చతుర్థ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3,116లతోపాటు జ్ఞాపికను అందజేస్తామని తెలిపారు. పోటీలను మంగళవారం ఉదయం 10 గంటలకు డీఎఫ్‌ఓ లక్ష్మణ్‌రంజిత్‌నాయక్ బొజ్జాయిగూడెం గ్రామంలో ప్రారంభిస్తారని చెప్పారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఇల్లెందు: నిరుద్యోగ యువతీ యువకులు హరిప్రియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్ బానోతు హరిసింగ్‌నాయక్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రజాభవన్‌లో జాబ్ మేళా ప్రారంభమవుతుందని, మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులు తమ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

భవనం మంజూరు చేయాలని సీఈఓకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న గద్దల రమేశ్

పాల్వంచరూరల్: మండలంలోని దంతలబోరు ఎస్సీకాలనీ పంచాయతీకి భవనం మంజూరు చేయాలని సర్పంచ్ గద్దల రమేశ్ సోమవారం జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీకి భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో సీసీరోడ్లు లేవని, తక్షణమే నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఫాతిమా షేక్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



ఫాతిమా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కొత్తగూడెంఅర్బన్/ పాల్వంచరూరల్: భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్‌ను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య సూచించారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫాతిమా జయంతి సందర్భంగా సోమవారం నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె జీవిత చరిత్ర పుస్తకాన్ని ప్రిన్సిపాల్ ఆవిష్కరించి మాట్లాడారు. ఫాతిమా షేక్ జీవిత చరిత్ర అందరికీ తెలిసేలా పుస్తకం రచించిన సయ్యద్ నజీర్ అహ్మద్‌ను ప్రశంసించారు. జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్‌తో పాటు సయ్యద్ అక్బర్, జె.స్టాలిన్, చారి, ఫారూక్, ఎండీ మంజూర్, బొల్లం భాస్కర్, ఎండీ తాజుద్దీన్, జె.అబ్రహం, డాక్టర్ వెంకటేశ్వర్లు, పి.విజయ్‌కుమార్, డాక్టర్ అరుణకుమారి, కోటగిరి రాంబాబు, ఎస్.శ్రీదేవి, డాక్టర్ స్వరూపారాణి, డాక్టర్ పూర్ణచందర్‌రావు, డాక్టర్ నరేందర్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు. ఇక కొత్తగూడెం న్యూగొల్లగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ జరినాబీని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా ఆధ్వర్యాన సన్మానించారు. జానీ, అయేషా నిసాన్, అయేషా, ఖాసీంపాషా, చంద్రనాగు, లావణ్య, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో రక్షణ, భద్రత



మాట్లాడుతున్న డీఎస్పీ రమణమూర్తి

ఇల్లెందు: పట్టణంలో చోరీలకు అడ్డుకట్ట వేయడంతో పాటు నేరాలు జరిగిన సమయంలో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని డీఎస్పీ ఎస్‌వీ రమణమూర్తి తెలిపారు. కొత్త బస్టాండ్ ఏరియా వ్యాపారులు, షాపు ఓనర్లతో పోలీస్ స్టేషన్‌లో సోమవారం సమావేశమై చర్చించారు. కొంత కాలంగా పట్టణాన్ని కవర్ చేసేలా కెమెరాలు ఏర్పాటు చేసినా, బస్టాండ్ ఏరియాలో ఆశించిన స్థాయిలో లేకపోవటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. వ్యాపారులంతా కలిసికట్టుగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం సీఐ రాజు మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా ప్రశాంతమైన జీవనం గడపొచ్చని తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ రాజేశ్, వ్యాపారులు పాలెపు ఆనంద్, సత్యనారాయణ, కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావు, వార రవి పాల్గొన్నారు.

ప్రజాస్వామిక పాలన అందించడమే లక్ష్యం



సమస్యలు తెలుసుకుంటున్న పోట్ల

కొత్తగూడెంరూరల్: చందాలు, దందాలు లేని ప్రజాస్వామిక పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెం నియోజకవర్గం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో కొందరు నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జేబీ శౌరి, మోతుకూరి ధర్మారావు, ఏనుగుల అర్జున్‌రావు, అల్లాడి నర్సింహారావు, కొంటు శ్రీను, గద్దం రాజశేఖర్, పెగడ భిక్షపతి, కాపా శ్రీనివాసరావు, అజ్మీరా సురేశ్ నాయక్, మధు, గద్దల రమేశ్, నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: గిరిజన సంక్షేమశాఖ కళాశాలలు, వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న దినసరి కార్మికులు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ దినసరి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ధర్నా చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులను పర్మనెంట్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దొడ్డా రవికుమార్, కె.సత్య, బి.రాము, బి.తవిర్యా, కె.జ్యోతి, ఎం.దయమణి, కె.సరోజిని, కె.కుమారి, ఈ.రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



బురదగుంతను పూడ్చివేస్తున్న దృశ్యం

టేకులపల్లి: మండలంలోని గోలియాతండా పంచాయతీ తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిలిచిఉంటోంది. తీవ్ర దుర్గంధం వస్తుండటంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ అంశంపై ఈ నెల 6న ×సాక్షిªలో బురదగుంతను పూడ్చించండి అనే శీర్షికన ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి సోమవారం ఎంపీడీఓ బాలరాజు ఆదేశాల మేరకు ఎంపీఓ లక్ష్మిగణేశ్‌గాంధీ పర్యవేక్షణలో కార్యదర్శి వాసం ప్రశాంత్ బురద నీటి గుంతను పూడ్చివేయించారు.

అటెన్షన్ ప్లీజ్

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా



కొత్తగూడెం 33వ వార్డు కూలీలైన్‌లో కిన్నెరసాని పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. అంతేకాక నీటితో వీధి బురదమయంగా మారి వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని వార్డుల్లో తాగునీటి సరఫరా లేకపోగా.. ఉన్న చోట్ల వృథా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

–కొత్తగూడెంటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి : రఘు, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం
సెల్ నంబర్ : 93905 42176